

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



## #బంగారుతల్లులు!

**నవరాత్రులు వస్తున్నాయి** కదా 303లోని అరవావిడ బొమ్మల కొలువుకి పిలుపులకి వచ్చి వెళ్ళింది. అప్పుడే సంవత్సరం తిరిగేసిందా అనుకున్నా. అట్టపెట్టెలతో అమర్చిన డి.ఐ.వై మెట్ల మీద గరుత్మంతుడు, సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయుడు, గోకులం, కొండపల్లి బొమ్మలు, ఏనుగు అంబారీలు, పూసల పల్లకీలో ఒదిగి కూర్చున్న పెళ్లి కొడుకూ పెళ్లి కూతురూ, బాజా భజంత్రీల వాళ్లు, దశావతారాలు అబ్బో మొత్తం మనమెరిగిన మన అస్థిత్వం అంతా ఆ మెట్లపైన కొలువు తీర్చేస్తుంది ఈవిడ. వీటికి తోడు వాళ్లబ్బాయికి ఇష్టమని ఒకసారి 'జురాసిక్ థీమ్' అని మరొక్కసారి 'లెగో ల్యాండ్' థీమ్ అని పక్కనే ఇంకో బుల్లి బొమ్మలకొలువు వెరైటీగా ఏర్పాటు చేస్తుంటుంది. ఈసారి ఏమి ఏర్పాటు చేస్తోందో మరి? అనుకుంటూ క్లోసెట్ లో ఉన్న కాసింత జాగాని పూర్తిగా వాడుకునేలా 'ఆర్గనైజ్' చేసిన ప్లాస్టిక్ భోషాణాల్లో చీరలు ఉన్న పెట్టెని తీసి ముందరేసుకుని కూర్చున్నా.

ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు ఎటు తిరగేసినా అవే పదేసి చీరలు. జంప్ సూట్లు, మిడీలు, మాక్సీల సౌకర్యం అలవాటైనా చీరల మీద మమకారం చావదు అదేమిటో! కానీ కొని ఏమి చేసుకోను ఇక్కడ? ఏదో ఇలాంటి విశేషాలకు ఓ పది నిముషాలు కట్టుకుని నలభై ఫోటోలు, అరడజను వీడియోలు తీసుకుని మడత పెట్టి లోపల పెట్టడం తప్పించి. ఆన్లైన్ షిప్పింగ్ అవీ వచ్చేసాయి కానీ అంతలేసి వెలలు పెట్టి కోనేటంత సందర్భాలు ఏవి? ఉద్యోగాలు చేసే అమ్మాయిలే కాస్త చూసి చూసి ఖర్చు చేస్తుంటే ఊరికే తోచక కొనడానికి అస్సలు బుద్ధి పుట్టదు. పీత కష్టాలు మరి! విచిత్రం ఏంటంటే పొరపాటున చీర కట్టుకుని ఫోటో పెట్టామా, ఇహ అది మరొక్క సారి కట్టామే అనుకోండి అది ఎపుడు ఎక్కడ ఎలా కట్టుకున్నామో మొహం మీదే చెప్పేస్తారు. ఏదో కాన్సర్ కి మందు కనిపెట్టినంత ఆనందంతో.

ఇలా ఉండి ఉంటే అమ్మా వాళ్లు ఎలా ఈదుకుని వచ్చి ఉండేవారో అసలు. పైగా అన్నీ కూడా ఇండియా ట్రిప్ వెళ్ళినప్పుడు హడావిడిగా కొని కుట్టించిన చీరలు, బ్లౌజులు. తీరా సందర్భం వచ్చి వాటిని తీసి వేసుకునేసరికి లేటెస్ట్

ఫ్యాషన్ కి ఎలాగూ ఒక తరం వెనకబడిన డిజైన్లే ఉంటాయి. దానికి తోడు అంతా మా ఊరి టైలరు బాషా గారి దయ. ఒకసారి కుట్టినట్టు ఇంకోసారి కుట్టడు. ఊరెళ్లి ఉండే కాసిన్ని రోజుల్లో బుర్ర నిండా 'ఇండియన్ డ్రెస్సులు కొనుట, కుట్టించుట' అనే పద్మవ్యూహ ప్రణాళికకు సంబంధించిన ఆలోచనలే నిండి ఉంటాయి. ఆ బాధలు అనుభవించిన వారికే ఎరుక. ఈ గోల భరించలేక రెండు ఇండియా ట్రిప్పులు అయ్యాక మా 'మిక్స్ అండ్ మ్యాచ్' బుడబుక్కల అవతారాలను ఎగా దిగా చూసి పెదవి విరిచే చుట్టాలను పట్టించుకోకుండా తిరిగే చాతుర్యం నేర్చేసుకున్నా.

మొత్తానికి అప్పటికప్పుడు ఒక కొత్త చీర కొనేద్దాం అనుకున్న ఆవేశాన్ని ఇన్స్టా గ్రామ్ లో ఆన్లైన్ సేల్స్ లో ఉండే చీరల ఫోటోలు చూసి చల్లార్చుకుని, బాగా ఆలోచించి చివరికి అమ్మ పెళ్లినాటి కంచి పట్టు చీర, దానికోసమని ఇండియా వెళ్లినప్పుడు మూడు బజార్లు తిరిగి రెండు సార్లు కుట్లు బాగుచేయించిన జాకెట్టు బయటికి తీసిపెట్టా.

నా నిగ్రహ శక్తి మీద, పొదుపు మీద నాకే ముచ్చట వేసింది. ఇంత మంచితనం ఏమిటో అని చివరాఖరికి చిరాకేసింది. 'మా చిన్నది బంగారు పిల్లమ్మా', 'చాలా బుద్ధిమంతురాలు', 'మంచిపిల్ల' అని చెప్పి చెప్పి ఇట్లా తయారు చేసారు అనుకుంటా! ఇవన్నీ బిరుదులు అనుకున్నాను కానీ ముందరి కాళ్లకి బంధాలు అనుకోలేదు. ఇప్పుడు స్వతంత్రించి నా పనులు నేనే చేసుకోగలిగినా అలవాటైన సర్దుకుపోవడాలు అనవసర ఖర్చుల మీద పగ్గాలేసి ఆపేస్తాయి ఒక్కోసారి. ఒకే వీధిలో ఉండే ఇద్దరు అక్కలు ఒక అన్నగారి చేతి నుండి మారి వచ్చిన టెక్స్ట్ బుక్కులు, కుటుంబంలోని పిల్లలకంతా వారసత్వంగా వచ్చే డిక్షనరీలు, అట్లాసులు. అక్క నుండి అందుకున్న జామెట్రీ బాక్సులు, లేడి బర్డ్ సైకిలు ఇవన్నీ తెలియకుండానే చాలా నేర్పించినట్టు ఉన్నాయి. పైగా ఆర్థిక స్వాతంత్ర్య రెక్కలు లేవు కదా, ఎక్కడ లేని లౌక్యం, జాగ్రత్త బయటికి వచ్చేస్తున్నాయి. ఈ పద్ధతులు, అణకువలు, సర్దుకుపోవడాలూ మాతో పాటు ఆఖరు అనుకుంటా.

నిన్న #206 లో ఉండే పద్మ గారు వచ్చి తనపై కస్సు బుస్సు లాడే వాళ్ల హై స్కూల్ పెద్దమ్మాయి గురించి చెప్పి బాధపడ్డప్పుడు ఇదే అనిపించింది. ప్రతి చిన్న విషయానికి విసుక్కోవడం, అలగడం, ఏదో తక్కువ చేసేస్తున్నారు అని గోల పెట్టడం, తలుపులు దడ దడ లాడించడం ఇలా సగటు టీనేజర్ తో పడే కష్టాలు అన్నీ చెప్పుకుంది. ఈ మధ్య దీర్ఘంగా ఆలోచనల్లో మునిగిపోయి, మాటి మాటికీ కళ్ళల్లో నీళ్లు నింపుకునే పిల్లని చూస్తూ ఊరుకోలేక పోతోంది. ఏదో విషయానికి కూతురు బాధపడుతోంది అని తెలుసు. పోనీ నెమ్మదిగా అడిగి చూద్దాం అంటే "నీకేమి తెలీదు! నీకు అర్థం కాదు!" అని మీద మీదకి వచ్చే ఇంతెత్తు పిల్లని చూసి దుఃఖం ఆపుకోలేకపోతోంది ఆవిడ.

ఇవన్నీ పోనీ వయసు ప్రభావం అని పక్కన పెట్టవచ్చు కానీ ప్రతి దానికీ ఆ అటు ఇటు కాని వయసు పిల్ల కళ్ళల్లో ఎగతాళి, చీదరింపు, హేళనకి తట్టుకోలేక పోతోంది పద్మ. అలా అని చూస్తూ ఊరుకోలేక పోతోంది. అమ్మని తప్ప అందరినీ నమ్మాలి అనిపించే వయసు అని ఆవిడకి తెలుసు. భావి జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోడంలోని

అస్పష్టతో, స్నేహితులతో వచ్చే ఆటుపోటులో ఇలా ఏదో సమస్యని భూతద్దం లోంచి చూసుకుని బాధ పడుతోందేమో అని పద్మ ఆలోచన. సరదాగా మాటల్లో దింపి తెలుసుకోమని నన్ను అడిగింది.

'నేనేమి మాట్లాడగలను!?' అనుకుంటూనే నేను దాటేసి వచ్చిన టీనేజ్ ని ఒకసారి గుర్తు చేసుకున్నా. ఇలా మూతి ముడవడాలు, తలుపులు ధడేలున వేసుకోడాలు చేసేటంత తెగింపులు మాకు ఎక్కడా? ఇలాంటి విప్లవ భావాలు ఏ కాస్త బయటికి కనిపించినా ఆ వారం తలంటు ఇంకో పావుగంట ఎక్కువ సేపు అయ్యేది. ఒంటికి, తలకి పట్టిన చెమురంతా వదిలేదాకా ఒకటే రుద్దుడు. అమ్మ చేతి గాజులు పైకి లాక్కుని షాంపూ చేతిలోకి తీసుకోగానే అన్ని స్వతంత్ర భావాలూ, విప్లవ భావాలూ పిల్లిలా పారిపోయేవి. ఇహ రోజూ తలకి నూనెరాసి జడలు దువ్వుతూ దువ్వుతూ ఇంటి పరిస్థితులు, లోటు పాట్లు వివరించి చెప్పి చెప్పీ ముందుగానే జీవితానికి దాసోహం అనేలా చేసేసి, నలుగురు నడిచే దారిలోనే తలెత్తకుండా నడిచేలా ఎదురు మాట్లాడకుండా చేసేసే వారు. ఆఖరులో 'మా బంగారుతల్లి!' అంటూ వారి ప్రేమకి మురిపాలకి బానిసల్ని చేసేసుకునేవాళ్ళు. ఇంకేముంది ఆ బిరుదు నిలుపుకోడానికి పాకులాడడంలోనే కౌమారం గడిచిపోయింది.

కానీ నేను 'బంగారు తల్లి'ని, 'మంచి పిల్ల'ని కాదు అని అరచి చెప్పాలని నాకూ అనిపించేది. ఎవరికీ కనిపించకుండా ముఖ్యంగా అమ్మకి కనిపించకుండా ముసుగేసుకుని దాక్కోవాలి అనిపించేది. ఏమనుకుంటారో అనే భయం. ఎదురింటి పక్కింటి బంగారు తల్లులు అమ్మ మెప్పు పొందేస్తారేమో అనే బెంగ. "నా చిట్టి తల్లేనా?" అని నాన్న ఆశ్చర్యపోతాడేమో అని సిగ్గు. "అంతకంటే అవమానం ఉంటుందా?" అనుకునేంత వెర్రితనం. గొంతులో అరుపు గొంతులోనే ఆగిపోయేది. బుర్రలో ఆలోచన స్పష్టంగా రూపుదిద్దుకోకుండానే ఆవిరైపోయేది.

భవిష్యత్తు గురించి బోలెడు ఆశలు, కొత్తగా ఏదైనా చెయ్యాలనే ఆరాటం, ఏమి చెయ్యాలో తెలియని అమాయకత్వం, ఎవరిని అడగాలో అనే మొహమాటం. నోరు పెగుల్చుకుని అడిగేలోపు ఇదివరకే ముందు వారు నడిచిన దారి చూపించే పెద్దలు. అది కాకుండా ఇంకోటి చేద్దామంటే కనిపించే మొండి గోడలు. తెగించి కొత్త దారిలో అడుగుపెట్టి అదృష్టం బాగుండి విజయం సాధించామా సరే! లేదనుకోండి, ఇహ అంతే సంగతులు .. "మందని కాదని పక్కకి వచ్చినందుకు ఏమవుతుందో చూడు!" అని మన వెనక వారికి మనల్ని చూపించేస్తారు. 'అందుకే ఎందుకొచ్చిన గొడవ!' అని సంఘం 'సురక్షితం' అని చెప్పిన ముద్రలు వేయించుకున్న వారమే ఎక్కువ మాలో.

అప్పటి మాకు రాంకులు సాధించిన వారు, పెద్ద కాలేజీల్లో సీట్లు వచ్చిన వారు, మాంచి ఉద్యోగం తెచ్చుకున్న వాళ్లు, వీళ్ళే మా ఆదర్శ మానవులు. భువిపై నడిచే అశ్వినీ దేవతలు. మాట్లాడాలంటే బెరుగ్గా ఉండేది. వారు కూడా తమ కేవో దివ్య శక్తులు ఉన్నట్టు మిగతా వారంతా ఉట్టి తుచ్ఛ మానవులు అన్నట్టు ఉండేవారు. సాధించేసిన విజయాలు వారికి మాత్రమే సొంతం అనిపించేలా, అవి చాలా తేలికగా తమ ఒడిలో వచ్చి వాలినట్టుగా చెప్పే వారిని చూసి ఇంకా ముడుచుకుపోయాం.

అలా కాకుండా మొదలుపెట్టినప్పుడు వారు కూడా మా వంటి వారే అని మా లాగే బోలెడు అనుమానాలు, భయాలు ఉండేవని చెప్పివుంటే?!

ఎన్ని సార్లు అనుకుని ఉంటాను ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడాల్సింది అని. తక్కువ చేసి గేలి చేస్తారేమో అనే అనుమానం భూతంలా పట్టుకుని ఉంటుంది ఆ వయసు పిల్లల్ని. ఆ బూచిని తరిమేసి, భుజం చుట్టూ చెయ్యేసి 'మేమూ అంతే' అంటూ మాట్లాడగలిగే ఒకరు ఉండి ఉంటే? అల్లిబిల్లిగా అల్లుకుపోయే అడవి తీగ లాంటి కౌమారానికి పందిరి వెయ్యగలిగే ఒక చక్కని మాట చెప్పి ఉంటే?. మనిషికి మనిషేగా సాయం చేయగలిగేది?

ఇంత కష్టం అంత లేత వయసులో ఒంటరిగా పడ్డానా అని తలచుకుంటే బెంగొచ్చేసింది. కుదిరితే రీళ్లు రీళ్లుగా సంవత్సరాలని వెనక్కి తిప్పేసి పదహారేళ్ళ నాటి ఆ నన్ను అక్కున చేర్చుకోవాలి అనిపించింది. ఇంకో మలుపు తిరిగితే చాలు చేరుకోవాల్సిన గమ్యం వచ్చేస్తుంది. కానీ అక్కడిదాకా వచ్చి ఆగిపోయి "ఇహ నా వల్ల కాదేమో? ఎదర దారి భయంకరంగా ఉంటుందో ఏమో?" అనుకుంటూ మదన పడుతున్న అప్పటి నన్ను చేరి "మరేం పరవాలేదు! అంత భయపడాల్సిందేం లేదు. ముందరి జీవితం ఇంకా బాగుంటుంది. నన్ను నమ్ము." అని ఊరడించాలి అనిపించింది.

అది జరిగేపని కాదు అని తెలుసు. జీవితం అంటే రుచి చూడడమే అని తెలుసు. కానీ అలాంటి బంగారు తల్లులే మనకి ఎదురైనప్పుడు వారిలో అప్పటి మనం కనిపించినప్పుడు కాసేపు మాట్లాడవచ్చు కదా. "నాకు మాత్రమే ఇలా జరుగుతోందేం?" అని మదనపడే వారిని ఊరడించవచ్చు కదా!

కళ్లముందే ఇంకో తరం వచ్చేసింది. మనం దాటి వచ్చేసిన నాలుగు రోడ్ల కూడలిలో నిల్చుని సరిగ్గా పదిహేనేళ్ల నాటి మనలాగే బెదురు కళ్లతో లేడి పిల్లలా చూస్తున్న ఈనాటి బంగారు తల్లులు! అనుభవాలకి మించిన పాఠాలు మరేమీ ఉండవు. చూసీ చూడనట్టు వెళ్లిపోకుండా కాసేపు పలకరించి మన అనుభవాలు పంచుకుందాం. వారి దారి ఎంచుకోడంలో ఒక చిన్న ఊతం ఇద్దాం. ఇప్పటి మన విజయాలన్నీ ముందు తరాల వారి అనుభవాల నుండి వచ్చినవే కదా?

పద్మకి కూడా చెప్పాలి. ఈ పదిహేనేళ్ల పిల్ల అరుపులూ, పెడబొబ్బలూ అంతా 'మేకపోతు గాంభీర్యం' అని భయపడక్కర్లేదు అని గుర్తు చెయ్యాలి. గాలి దుమారంలా వచ్చే ఈ అవస్థ దాటేస్తే పిల్లకి అమ్మని మించిన 'బెస్టు ఫ్రెండు' ప్రపంచంలో ఇంకెవరూ ఉండరు అని తెలిసొస్తుంది. అప్పుడూ, వాళ్లిద్దరూ కలిసి తోటలో మొక్కలకి నీళ్లు పోస్తూనో, అన్నంలోకి వడియాలు వేయిస్తూనో పంచుకునే పాతా-కొత్త కబుర్లు అన్నీ చెప్పి ఊరించి ఊరడించాలి. జీవితం ఎంత అందమైనదండీ..!! గుర్తుచెయ్యాలి. ఆఁ ! అనుకుంటూ ఈ లోకం లోకి వచ్చాను.

ఎదురుగా ఉన్నపెట్టెలోంచి వంగపండు రంగు పరికిణీకి పసుపు రంగు ఓణీ ఉన్న డిజైనర్ లంగా ఓణీ తీసి పట్టు చీరతో పాటు పక్కన పెట్టాను. చిన్నప్పటి ఫ్రెండు టిక్ టాక్ వీడియోలో లెహంగా వేసుకుని స్లో మోషన్లో గుండ్రాలు

తిరుగుతూ ఉంటే చూసి తట్టుకోలేక నిగ్రహం కోల్పోయి అయిన డాలర్లన్నీ పోసి కొని ఒకే ఒక్కసారి వేసుకుని పెట్టెలో పెట్టేసింది. ఇప్పుడంటే అమ్మమ్మలు కూడా పరికిణీలు కట్టుకుని టిక్ టాక్ లు చేస్తున్నారు అనుకోండి. ఆమ్మో! ఏమీ అనరాదు.. మనోభావాలు దెబ్బతింటాయి మరి. వయసుని హుందాగా ఆహ్వానించడం కూడా ఒక కళ అని పెద్దవాళ్ళకి ఎలా చెప్తాము? '#గ్రో అప్ బ్రో'.. '#చిల్ యార్ ' అని అక్షింతలు వేస్తారు తిరిగి.

ఈ లంగా ఓణీ బొమ్మల కొలువుకి పద్మ వాళ్ల అమ్మాయిని కట్టుకోమని చెప్తా. పదిహేనేళ్ల పిల్ల ..రామప్ప గుడిలో యక్షిణి కదిలి వచ్చినట్టు ఉంటుంది. కన్నుల పండుగ! నేనే తయారు చేస్తా. అప్పుడు మాట్లాడవచ్చు. చిన్నదాని గుండెలో గుబులేంటో కనుక్కోవచ్చు. ప్రయత్నం చేసి చూద్దాం అనుకుంటూ కదిలాను.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments